రూపురేఖలు మారనున్న రోడ్లు

- పదకొండు రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు
- కల్మలచెరువు– చెవ్వారిగూడెం, పాలకవీడు సబ్‌స్టేషన్ వరకు కొనసాగుతున్న పనులు
- మరో వారం రోజుల్లో మిగతా రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభం
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు



కల్మలచెరువు నుంచి చెవ్వారిగూడెం రోడ్డు పనుల్లో భాగంగా చేపడుతున్న పైప్‌లైన్ పనులు



కల్మలచెరువు నుంచి దిర్శించర్ల వరకు జరుగుతున్న రోడ్డు పనులు

గరిడేపల్లి : మండలంలో మరో పదకొండు రోడ్లకు మహర్దశ పట్టింది. త్వరలో వాటి రూపురేఖలు మారునున్నాయి. మొత్తం 38 కిలో మీటర్ల మేర బీటీ రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం ఇటీవల పంచాయతీరాజ్ శాఖ నుంచి రూ. 26 కోట్ల 89 లక్షల నిధులు మంజూరు చేసింది. దీంతో కల్మల చెరువు నుంచి చెవ్వారిగూడెం, కల్మలచెరువు నుంచి పాలకవీడు సబ్‌స్టేషన్ వరకు రోడ్ల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. మిగతా రోడ్ల నిర్మాణలను కూడా వారం రోజుల్లో ప్రారంభించనున్నట్లు అధికారులు చెబుతున్నారు.

మంజూరైన రోడ్లు ఇవీ..

మండలంలో కల్మలచెరువు గ్రామం నుంచి చెవ్వారిగూడెం వరకు 4.60 కిలో మీటర్లు బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.3. 50 కోట్లు మంజూరయ్యాయి. కల్మలచెరువు నుంచి గానుగబండ వరకు నాలుగు కిలో మీటర్ల రోడ్డు నిర్మాణానికి రూ. 2 కోట్ల 80 లక్షలు, అలింగాపురం నుంచి హనుమంతుల గూడెం, లుంభా తండా, సీత్లాతండా వరకు నాలుగు కిలో మీటర్ల రోడ్డుకు రూ. 2 కోట్ల 80 లక్షలు, హనుమంతులగూడెం నుంచి సోమ్లాతండా వరకు 1.20 కిలో మీటర్ల మేర రోడ్డుకు రూ.84 లక్షలు మంజూరయ్యాయి. అదేవిధంగా కల్మలచెరువు నుంచి బొత్తలపాలెం వరకు ఐదు కిలో మీటర్ల మేర మీటీ రోడ్డు నిర్మాణానికి రూ. 3 కోట్ల 50 లక్షలు, కల్మలచెరువు నుంచి పాలకవీడు సబ్‌స్టేషన్ వరకు ఆరు కిలో మీటర్లు రోడ్డు నిర్మాణానికి రూ. 4 కోట్ల 20లక్షలు మంజూరయ్యాయి. గానుగబండ నుంచి హనుమంతులగూడెం వరకు 5 కిలో మీటర్లకు రూ.3 కోట్ల 50 లక్షలు, గానుగబండ హైస్కూల్ నుంచి పరెడ్డిగూడెం గ్రామం వరకు రెండు కిలో మీటర్లకు రూ. కోటి 40 లక్షలు, పొనుగోడు నుంచి అప్పన్నపేట వరకు 4.30 కిలో మీటర్ల రోడ్డు నిర్మాణానికి రూ. 3 కోట్ల 15 లక్షలు, పొనుగోడు పాత బస్టాండ్ నుంచి మెయిన్ రోడ్డు వరకు 0. 7 కిలోమీటర్ రోడ్డుకు రూ.50 లక్షలు, మల్లయ్యగూడెం బీటీ రోడ్డు నుంచి పాత నేరేడుచర్ల రోడ్డు వరకు కిలో మీటర్ రూ. 70 లక్షల నిధులు మంజూరయ్యాయి. రహదారులు బాగా లేక ఇన్నాళ్లు ఇబ్బంది పడిన ప్రజలు బీటీ రోడ్లు మంజూరు కావడంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు. నిధులు మంజూరు చేయించిన మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

ఇబ్బందులు తొలగనున్నాయి



"మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కృషితోనే రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. రోడ్ల నిర్మాణం పూర్తయితే ఎన్నో ఏళ్లుగా ఇబ్బందులు పడుతున్న ప్రజలకు ఇబ్బందులు తొలుగుతాయి. నిధులు మంజూరు చేయించిన మంత్రికి కృతజ్ఞతలు.

– మూలగుండ్ల సీతారాంరెడ్డి, కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్, గరిడేపల్లి

వారం రోజుల్లో అన్ని రోడ్ల పనులు ప్రారంభం



"మండలంలో 11 రోడ్ల నిర్మాణానికి రూ. 26 కోట్ల 89 లక్షల నిధులు మంజూరయ్యాయి. ప్రస్తుతం చెవ్వారిగూడెం రోడ్డు, కల్మలచెరువు సబ్‌స్టేషన్ రోడ్డు పనులు ప్రారంభమయ్యాయి. మరో వారం రోజుల్లో మిగతా తొమ్మిది రోడ్ల నిర్మాణ పనులు కూడా ప్రారంభమవుతాయి.

– ప్రదీప్, పంచాయతీరాజ్ ఏఈ, గరిడేపల్లి

క్లుప్తంగా

క్షేత్రపాలకుడికి ఆకుపూజ



బూరుగడ్డలోని దేవాలయంలో పూజలో పాల్గొన్న భక్తులు

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని బూరుగడ్డలో గల శ్రీఆదివరాహ లక్ష్మీనర్సింహ వేణుగోపాలస్వామి, గోపాలపురంలోని శ్రీఆంజనేయస్వామి దేవాలయాల్లో మంగళవారం ఆంజనేయస్వామికి ఆకుపూజ చేశారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం సుప్రభాతసేవ, ఆరాధన, మంగళాశాసనం, ఆంజనేయస్వామికి పంచామృతాలు, 108 తమలపాకులతో అభిషేకం, గంధ సింధూరం, మన్యసూక్త పారాయణం, శ్రీరామ, ఆంజనేయ అష్టోత్తర శత నామావళి, అలంకరణ, తీర్థప్రసాద వితరణ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయాల ఈవోలు, అర్చకులు, ధర్మకర్తలు, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

నేడు దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ

హుజూర్‌నగర్‌రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా అందించే ఉపకరణాల (వీల్ చైర్)ను దివ్యాంగులు, వయో వృద్ధులు సద్వినియోగం చేసుకోవాలని హుజూర్‌నగర్ ఇన్‌చార్జ్ ఎంపీడీఓ పిండిప్రోలు లావణ్య అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ.. హుజూర్‌నగర్, గరిడేపల్లి, నేరేడుచర్ల, పాలకవీడు, మఠంపల్లి, మేళ్లచెరువు, చింతలపాలెం మండలాలకు చెందిన దివ్యాంగులు, వయో వృద్ధులకు బుధవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు హుజూర్‌నగర్ పట్టణంలోని టౌన్ హాల్‌లో ఉచితంగా ఉపకరణాలు (వీల్ చైర్)ను పంపిణీ చేయనున్నట్లు ఆమె తెలిపారు.

రేపు కోదాడలో..

మోతె : కోదాడ పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో నియోజకవర్గానికి చెందిన దివ్యాంగులకు, వయోవృద్ధులకు గురువారం సహాయ ఉపకరణాలను (ట్రై సైకిల్స్, మూడు చక్రాల రిక్షా, వీల్ చైర్లు, చంక కర్రలు, చేతి కర్రలు) అధికారులు పంపిణీ చేయనున్నట్లు మండల అభివృద్ధి అధికారి టి.ఆంజనేయులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన దివ్యాంగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దివ్యాంగులు, వయోవృద్ధులు యూడీ ఐడీ కార్డు, ఆధార్ కార్డు, రేషన్ కార్డు, ఆదాయ ధృవీకరణ పత్రంతో పాటు ఆన్‌లైన్ చేసిన అప్లికేషన్ రసీదును వెంట తీసుకువెళ్లాలని సూచించారు.

రామాపురం వాసికి ప్రొఫెసర్‌గా పదోన్నతి



ప్రభాకర్

నడిగూడెం : హైదరాబాద్‌లోని ఖైరతాబాద్‌లో గల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కామర్స్ విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న నడిగూడెం మండల పరిధిలోని రామాపురం గ్రామానికి చెందిన డాక్టర్ వాసా ప్రభాకర్‌కు ప్రొఫెసర్‌గా పదోన్నతి లభించింది. ఈ మేరకు మంగళవారం తెలంగాణ ప్రభుత్వ కళాశాలల విద్యా కమిషన్ ఉత్తర్వులు జారీ చేసింది. కాగా, ప్రభాకర్ అదే కళాశాలలో కామర్స్ విభాగం అధిపతిగా, డిగ్రీ (దోస్త్ ఆన్‌లైన్) ప్రవేశాల ప్రత్యేక కోఆర్డినేటర్‌గా గత నాలుగు సంవత్సరాలుగా సేవలు అందించారు. పదోన్నతి పొందిన ప్రభాకర్‌కు ఈ సందర్భంగా రామాపురం గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కోదాడరూరల్ : మండలంలోని దోరకుంట సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్లకు తాకుతున్న చెట్ల కొమ్మలను తొలగించనున్నందున దోరకుంట, నెమలిపురి, తమ్మరబండపాలెం గ్రామాలకు బుధవారం ఉదయం 8 గంటల నుంచి 11 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ రూరల్ ఏఈ ఎస్‌కె.సైదా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా గ్రామాల ప్రజలు తమకు సహకరించాలని ఆయన కోరారు.

బేతవోలు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో..

చిలుకూరు : మండల పరిధిలోని బేతవోలు విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో 11 కేవీ లైన్ మరమ్మతుల కారణంగా ఫీడర్ పరిధిలో బుధవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్‌కో ఏఈ రామిశెట్టి శ్రీనివాస్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

వేసవి దృష్ట్యా రైతులు జాగ్రత్తలు పాటించాలి

మునగాల : వేసవి దృష్ట్యా రైతులు తగు జాగ్రత్తలు పాటించాలని స్థానిక ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ సూచించారు. మంగళవారం మునగాల పోలీస్‌స్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. వేసవికాలంలో దొంగతనాలు ఎక్కువగా జరిగే అవకాశం ఉన్నందున వ్యవసాయ పొలాల వద్ద ఉన్న విద్యుత్ మోటార్లు, ఇతర పరికరాలను ఇంటి వద్ద భద్రపరుచుకోవాలని సూచించారు. వరికొయ్యలకు నిప్పు పెడితే అగ్నిప్రమాదాలు జరిగుతాయని, కావున వరికొయ్యలకు నిప్పు పెట్టవద్దని కోరారు. పశువులను మేతకు వదలిపెట్టడం వలన చోరీకి గురయ్యే అవకాశం ఉన్నందున ఇంటి వద్దే కట్టేసుకుని మేపుకోవాలన్నారు.

మట్టపల్లిలో వైభవంగా మహాలక్ష్మి యాగం



మహాలక్ష్మి యాగం నిర్వహిస్తున్న యాజ్ఞికులు, అర్చకులు, ధర్మకర్తలు

మఠంపల్లి : మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో జరుగుతున్న శ్రీరాజ్యలక్ష్మి చెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మీ నరసింహస్వామి తిరుకల్యాణోత్సవాల్లో భాగంగా నాలుగవ రోజైన మంగళవారం ఆలయంలో శ్రీసూక్త సహిత మహాలక్ష్మి యాగాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యాజ్ఞికులు బొర్రా వెంకటవాసుదేవాచార్యులు ఆధ్వర్యంలో ప్రాతఃకాలార్చన, సుప్రభాత సేవ, ద్రవిడ ప్రబంధ సేవాకాలం, మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం, అర్చనాదులు, ప్రాభోది మంత్ర పుష్ప నీరాజనాలతో శ్రీరాజ్యలక్ష్మి అమ్మవారికి సమస్ర కుంకుమార్చనలు చేశారు. అనంతరం మహాలక్ష్మి యాగం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈవో నవీన్‌కుమార్, అర్చకులు రామాచార్యులు, శ్రీనివాసాచార్యులు, పద్మనాభాచార్యులు, బదరీ నారాయణాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఫణిభూషణ మంగాచార్యులు, బ్రహ్మాచార్యులు, ఆంజనేయాచార్యులు, శేషగిరిరావు, శ్రీనివాసరావు, సీతారామాచార్యులు, నరేందర్, రాజేష్, భక్తులు పాల్గొన్నారు.

కరివిరాల విద్యార్థికి ఎప్‌సెట్‌లో 41వ ర్యాంకు రైట



ప్రణీత్‌రెడ్డి

నడిగూడెం : ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన ఎప్‌సెట్ ఫలితాల్లో నడిగూడెం మండలం కరివిరాలకు చెందిన ఆరె.ప్రవీణ్‌రెడ్డి రాష్ట్ర స్థాయిలో 41 ర్యాంకు సాధించాడు. ప్రణీత్‌రెడ్డి కోదాడలో పాఠశాల విద్య, విజయవాడలోని శ్రీచైతన్య కళాశాలలో ఇంటర్మీడియట్ చదివాడు. జేఈఈ మెయిన్స్‌లో ఆల్ ఇండియాలో 462వ ర్యాంకు సాధించాడు. ప్రణీత్‌రెడ్డి తండ్రి వీరారెడ్డి అనంతగిరి మండలం పాలారం ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. ఈ సందర్భంగా మంగళవారం ఆ గ్రామపెద్దలు, తోటి స్నేహితులు ప్రవీణ్‌రెడ్డికి అభినందనలు తెలిపారు.

ఏఐవైఎఫ్ మహాసభలను విజయవంతం చేయాలి



కోదాడరూరల్ : మహాసభల కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

కోదాడరూరల్ : తిరుపతిలో ఈ నెల 15 నుంచి 18 వరకు జరిగే ఏఐవైఎఫ్ జాతీయ 17వ మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు చిలకరాజు శ్రీను పిలుపునిచ్చారు. మంగళవారం కోదాడ పట్టణంలో మహాసభల కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. విద్యార్థులు, యువత ఎదుర్కొంటున్న విద్య, నిరుద్యోగ సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఆరోపించారు. ప్రభుత్వ, ప్రైవేట్ రంగ సంస్థల్లో వేలాది ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని ఎన్నికల సమయంలో చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని అమలు చేయడం లేదని విమర్శించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు అనంతుల రాము, తదితరులు ఉన్నారు.

ఏఐవైఎఫ్ మహాసభల కరపత్రం ఆవిష్కరణ

నేరేడుచర్ల : ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతిలో ఈనెల 15 నుంచి 18వ తేదీ వరకు జరగనున్న అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) జాతీయ మహాసభల కరపత్రాన్ని మంగళవారం నేరేడుచర్లలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు చిలకరాజు శ్రీనివాస్ విడుదల చేశారు. కార్యక్రమంలో సంఘం పట్టణ అధ్యక్షుడు భరత్, శ్రీనివాస్, వివేక్, రాము తదితరులు ఉన్నారు.

మిత్రుడి కుటుంబానికి ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న మిత్రులు

మునగాల : మండల కేంద్రానికి చెందిన తంగెళ్ల చిన్నా ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్నాడు. దీంతో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2001– 02 విద్యా సంవత్సరంలో అతనితో పాటు పదవ తరగతి విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థులు రూ.పదివేల ఆర్థిక సాయాన్ని చిన్నా భార్య శ్రీకళకు మంగళవారం అందజేశారు. ఆర్థికసాయం అందజేసిన వారిలో మచ్చా ఉపేందర్, సురభి శేఖర్, మణికంఠ, మండవ చందర్‌రావు, కె.గోవర్ధన్, కోల శ్రీను, మండవ లక్ష్మయ్య, విజయ, రేణుక, రాధిక, రఫి ఉన్నారు.

బీసీ జేఏసీ నిర్మాణమే లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న ధనుంజయనాయుడు

కోదాడరూరల్ : రాష్ట్ర వ్యాప్తంగా బీసీ ఉద్యమాలను ఐక్యం చేసి బీసీ జేఏసీ నిర్మాణమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నట్లు బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దూళిపాల ధనుంజయ నాయుడు అన్నారు. మంగళవారం కోదాడ పట్టణ పరిధిలోని బాలాజీనగర్‌లో గల ఎల్‌ఐసీ ఏజెంట్ భవనంలో నిర్వహించిన బీసీ హక్కుల సాధన సమితి మూడవ సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎన్నికల సమయంలో బీసీ, ఎస్సీ, ఎస్టీలకు అలవికాని హామిలిస్తూ గత 78 ఏళ్లుగా అగ్రకుల నాయకులు మోసం చేస్తూ వస్తున్నారని ఆయన ఆరోపించారు. రానున్న ఎన్నికల్లో బీసీలు ఐక్యంగా ఉంటూ రాజ్యాధికారమే లక్ష్యంగా పనిచేద్దామని అన్నారు. జనాభాలో 56 శాతం ఉన్న బీసీలకు అన్ని రంగాల్లో అదే స్థాయిలో వాటా దక్కాలన్నారు. కార్యక్రమంలో దంతాల రాంబాబు, మేకల శ్రీనివాసరావు, గుండు వెంకటేశ్వర్లు, ఎస్‌కె.లతీఫ్, శ్రీను, కనకయ్య, సింహాద్రి, వెంకటరమణచారి, వీరయ్య, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

విద్యుదాఘాతంతో మూడు పాడి గేదెలు మృతి



మృతి చెందిన గేదెల వద్ద బాధిత రైతు

చిలుకూరు : విద్యుదాఘాతంలో మూడు పాడి గేదెలు మృతి చెందాయి. ఈ ఘటన మంగళవారం చిలుకూరు మండల పరిధిలోని సీతారాంపురం గ్రామంలో జరిగింది. బాధిత రైతులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గన్నా వెంకటేశ్వర్లు, గన్నా సత్యనారాయణ, గోపిదేశి ముత్తయ్యలు రోజు మాదిరిగానే మేత కోసం పశువులను పొలాల్లోకి వదిలారు. గ్రామ పరిధిలోని సబ్బుల ఫ్యాక్టరీ గోదాము వెనుక గల పొలాల్లో కరెంట్ తీగలు గేదెలకు తగిలి విద్యుదాఘాతంతో అక్కడిక్కడే మృతి చెందాయి. మృతి చెందిన గేదెల విలువ రూ.2 లక్షలకు పైగా ఉంటుందని, ప్రభుత్వం తమను ఆదుకోవాలని బాధిత రైతులు కోరారు.

కొనసాగుతున్న చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు

నడిగూడెం : మండలంలోని కరివిరాలలో శ్రీదేవి భూదేవి శ్రీ చెన్నకేశవస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. మంగళవారం స్వామివారి కల్యాణ మహోత్సవం, నిత్యహోమం, బలిహరణ, తీర్థప్రసాద వినియోగం, గరుడసేవ తదితర కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

నర్సింగ్ వృత్తి ఎంతో విలువైనది

సూర్యాపేటటౌన్ : రోగుల పట్ల అంకితభావంతో సేవలందిస్తున్న నర్సుల సేవలు ఎంతో విలువైనవని సూర్యాపేట ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ సత్యనారాయణ, ప్రభుత్వ మెడికల్ కాలేజ్ ప్రిన్సిపల్ డాక్టర్ జయలత అన్నారు. జిల్లా కేంద్రంలో సూర్యాపేట ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ నర్సింగ్ సూపరింటెండెంట్ వరమ్మ, రేణుక భాయి ఆధ్వర్యంలో మంగళవారం అంతర్జాతీయ నర్సుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సింగ్ సేవల మాతృమూర్తి ఫ్లోరెన్స్ నైటింగేల్ చిత్రపటానికి నివాళులర్పించారు. నైటింగేల్ జయంతిని పురస్కరించుకొని కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో మెడికల్ వైద్య సిబ్బంది, నర్సింగ్ ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.

మత్తు రహిత సమాజ స్థాపనకు కృషి



విచిత్ర వేషధారణలో అవగాహన కల్పిస్తున్న ప్రభాకర్

సూర్యాపేట అర్బన్ : యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, మత్తు రహిత సమాజ స్థాపనకు తనవంతు కృషి చేస్తానని ప్రభుత్వ ఉపాధ్యాయుడు రాచకొండ ప్రభాకర్ అన్నారు. మంగళవారం పట్టణంలోని ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాల, ఎన్‌టీఆర్ పార్క్ సమీపంలో ప్రచారం నిర్వహించారు. మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాలు, మద్యపానం, ధూమపానం వల్ల కలిగే నష్టాలపై పాలీసెట్ పరీక్ష కోసం వచ్చిన విద్యార్థులకు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు.

వర్షాకాలంలోగా పనులు పూర్తిచేయాలి

- కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్

సూర్యాపేట అర్బన్ : మున్సిపాలిటీ పరిధిలో అమృత్ పథకం 2.0లో జరుగుతున్న అండర్ గ్రౌండ్ డ్రైయినేజీ, వాటర్ ట్యాంకులు, పైప్‌లైన్ పనులను రానున్న వర్షాకాలంలోగా పూర్తి చేయాలని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ అన్నారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్, పబ్లిక్ హెల్త్ డిపార్ట్‌మెంట్ అధికారులతో రివ్యూ సమావేశం నిర్వహించి మాట్లాడారు. పట్టణంలో నీటి సరఫరా సక్రమంగా అయ్యేవిధంగా చూడాలని అన్నారు. ప్రతి ఇంటిలో ప్రజలు ఇంకుడుగుంతలు ఏర్పాటు చేసుకొని భూమిలో నీటి శాతం పెంపొందించేలా అవగాహన కల్పించాలని సూచించారు. అనుమతులు లేకుండా భవనాలు నిర్మిస్తే చర్యలు తీసుకోవాలన్నారు. ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తు చేసుకున్న వారు ఈ నెల 31లోపు 25శాతం రిబేట్‌తో పేమెంట్ చెల్లించాలని తెలిపారు. ఎల్‌ఆర్‌ఎస్ లేకుండా ఉంటే భవన నిర్మాణ అనుమతులు ఇవ్వకూడదని అన్నారు. పట్టణంలో రానున్న వర్షాకాలంలోగా నాలాల్లో, డ్రైయినేజీలలో పూడిక తొలగింపు పనులు 100 శాతం పూర్తిచేయాలని తెలిపారు. మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాస్, పబ్లిక్ హెల్త్ ఈఈ సత్యనారాయణ, మున్సిపల్ ఈఈ కిరణ్, డీఈ సత్యారావు, రమాదేవి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సారగండ్ల శ్రీనివాస్, ఆర్వో కళ్యాణి, టీపీఎస్ శశి కుమార్ పాల్గొన్నారు.

దంతెల వాగు పరిశీలన

సాక్షి ఎఫెక్ట్..



తాడువాయి శివారులోని దంతెల వాగును పరిశీలిస్తున్న ఇరిగేషన్ శాఖ అధికారులు

మునగాల : మండలంలోని తాడువాయి గ్రామ రెవెన్యూ పరిధిలో సుమారు 100 ఎకరాల్లో విస్తరించి ఉన్న దంతెల వాగును కొందరు రైతులు మట్టిపోసి చదును చేసి ఆక్రమణలకు పాల్పడుతుండడంతో సోమవారం సాక్షి దినపత్రికలో 'దంతెల వాగు ఆక్రమణ'అనే శీర్షికతో వార్త ప్రచురితం కావడంతో ఇరిగేషన్ అధికారులు స్పందించారు. మంగళవారం ఇరిగేషన్ డీఈ ఆనంద్, ఏఈలు శ్రీనివాస్, వినయ్, ఏఐఈఈ ప్రవీణ్, మండల ఆర్ఐ ఎన్.రామారావులు ఆక్రమణలకు గురైన దంతెల వాగును పరిశీలించారు. వాగులో మట్టి పోసి చదును చేసి ఆక్రమణలకు పాల్పడుతున్న సదరు రైతును పిలిపించి హెచ్చరించి వాగులో పోసిన మట్టిని తొలగించాలని ఆదేశించారు. భవిష్యత్‌లో ఆక్రమణలకు పాల్పడితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

డొంక రోడ్డు నిర్మాణంతో రైతులకు మేలు



రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అరుణ్‌కుమార్ దేశ్‌ముఖ్

హుజూర్‌నగర్‌రూరల్ : డొంక రోడ్డు నిర్మాణంతో రైతులకు మేలు జరుగుతుందని హుజూర్‌నగర్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అరుణ్‌కుమార్ దేశ్‌ముఖ్ అన్నారు. మండల పరిధిలోని బూరుగడ్డ నుంచి హుజూర్‌నగర్ వరకు వ్యవసాయ పొలాలకు వెళ్లే డొంక దారి నిర్మాణ పనులను మంగళవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. హుజూర్‌నగర్ నుంచి వచ్చే రైతులతో పాటు బూరుగడ్డ గ్రామ రైతులు తమ వ్యవసాయ పొలాలకు వెళ్లేందుకు చాలా ఇబ్బందులు పడుతున్న విషయం మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దృష్టికి ఇటీవల తీసుకెళ్లడంతో ఆయన స్పందించి వెంటనే వాగుపై వంతెన, డొంక రోడ్డు నిర్మాణానికి రూ. కోటి 10 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. రోడ్డు నిర్మాణం పూర్తయితే రైతులు పొలాలకు వెళ్లేందుకు దూరం తగ్గుతుందని తెలిపారు. ఆయన వెంట రైతులు, గ్రామపెద్దలు ఉన్నారు.

పద్మశాలి అన్నదాన సత్రం కమిటీ ఎన్నిక



ప్రమాణస్వీకారం చేస్తున్న నూతన కమిటీ సభ్యులు

మఠంపల్లి :మండలంలోని మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో గల శ్రీమార్కండేయ పద్మశాలి అన్నదాన సత్రం నూతన కమిటీని మంగళవారం స్థానికంగా ఆ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు గుర్రం మార్కండేయ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సత్రం కమిటీ అధ్యక్షుడిగా చిన్నం వీరమల్లు, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా పిండిప్రోలు రామచంద్రయ్య, గౌరవ అధ్యక్షుడిగా నామని కుమారస్వామి, గోలి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కొంగర నరసింహారావు, కోశాధికారిగా గోనె అంకయ్య, కన్వీనర్‌గా చిలువేరు అంజయ్య, ఉపాధ్యక్షుడిగా కొండ లక్ష్మీనారాయణ, గోలి కోటేశ్వరరావు, సహాయ కార్యదర్శులుగా గుర్రం శ్రీనివాసరావు, గుంటి ప్రసాద్, గౌరవ సలహాదారులుగా జల్లా సత్తయ్య, రుద్ర కృష్ణారావు, సోషల్ మీడియా ఆర్గనైజర్లుగా పిల్లలమర్రి పుల్లారావు, గోలి వెంకటేశ్వర్లును ఎన్నుకున్నారు. రాష్ట్ర చేనేత ఐక్యవేదిక అధ్యక్షుడు రాపోలు వీరమోహన్ నూతన కమిటీ సభ్యులచే ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం ప్రధాన కార్యదర్శి అప్పం శ్రీనివాసరావు, రాష్ట్ర గౌరవ సలహాదారుడు రావిరాల నరసయ్య, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ అధికారుల తనిఖీలు



బేకరీ యజమాని నుంచి జరిమానా వసూలు చేస్తున్న మున్సిపల్ అధికారులు

నేరేడుచర్ల : పట్టణంలో మున్సిపల్ కమిషనర్ యడవల్లి అశోక్‌రెడ్డి ఆదేశాల మేరకు మున్సిపల్ అధికారులు మంగళవారం రెండవ రోజు బేకరీలు, దుకాణాలు, హోటళ్లల్లో ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. పారిశుద్ధ్యం పాటించని ఓ బేకరీ యజమానికి రూ. 500 జరిమానా విధించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. 120 మైక్రాన్ల కంటే తక్కువ మందం కలిగిన నిషేధిత ప్లాస్టిక్ కవర్లను వినియోగించొద్దని దుకాణాల నిర్వాహకులకు సూచించారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలని అన్నారు. ఈ తనిఖీల్లో మున్సిపల్ మేనేజర్ ఎస్‌కె.యాకుబ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ షరీఫ్, పర్యావరణ ఇంజనీర్ ప్రవీణ్, వార్డు ఆఫీసర్లు తదితరులు ఉన్నారు.

దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి



హుజూర్‌నగర్ : సమావేశంలో మాట్లాడుతున్న ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు జడ శ్రీనివాస్



కోదాడరూరల్ : సమ్మె పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఐఎఫ్‌టీయూ నాయకులు

హుజూర్‌నగర్ : నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేసి 44 కార్మిక చట్టాలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు జడ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం హుజూర్‌నగర్ పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన ఏఐటీయూసీ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశ జనాభాలో సగానికి పైగా ఉన్న కార్మిక లోకానికి అన్యాయం చేసేవిధంగా కేంద్ర ప్రభుత్వం చట్ట సవరణ పేరుతో పెట్టుబడి వర్గానికి అనుకూలంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. పెట్టుబడిదారులకు వత్తాసు పలుకుతూ కార్మిక చట్టాలను కాలరాస్తున్న ప్రభుత్వంపై నిరసనగా ఈనెల 20న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) జిల్లా కార్యదర్శి జెట్టి ప్రసాద్, నాయకులు ముదును పాపారావు, బెజ్జం రమేష్, నర్సింహారావు, జక్కుల రమణ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమ్మెను జయప్రదం చేయాలి


కోదాడరూరల్ : అఖిల పక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 20 తేదీన నిర్వహించ తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి వి.నరసింహరావు పిలుపునిచ్చారు. మంగళవారం కోదాడ పట్టణంలోని లాల్ బంగ్లాలో ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో ఆయన సమ్మె పోస్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తూ సంపన్న వర్గాలకు మేలు చేసే విధాలను అవలంబిస్తుందని విమర్శించారు. కార్మికులు పోరాడి సాధించుకున్న అనేక చట్టాలను కుదించి నాలుగు కోడ్‌లుగా తీసుకువచ్చే కుట్ర చేస్తుందన్నారు. వాటితో కార్మిక వర్గాలకు నష్టం జరగనుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అరుణోదయ జిల్లా అధ్యక్షుడు ఉదయగిరి, వీరబాబు, విజయ్, నరసింహారావు, సలీం, రవితేజ, కొండలు, ఖాసీం, నగేష్, సైదులు ఉన్నారు.

సమ్మె పోస్టర్ ఆవిష్కరణ


మఠంపల్లి : ఈనెల 20న నిర్వహించ తలపెట్టిన అఖిల పక్ష కార్మిక సంఘాల సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు సయ్యద్ రన్‌మియా, తెలంగాణ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు మాళోతు బాలునాయక్ కోరారు. మంగళవారం మండల కేంద్రంలో పలు కార్మిక సంఘాల నాయకులు, కార్మికులతో కలిసి సమ్మె వాల్ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు ఇంటి రవి, మైసయ్య, రవి, పిచ్చయ్య, మహ్మద్, రహీం, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సమ్మె నోటీస్ అందజేత

నేరేడుచర్ల : కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న పాలకుల వైఖరికి నిరసనగా ఈ నెల 20వ తేదీన దేశ వ్యాప్తంగా జరగనున్న సార్వత్రిక సమ్మెకు మద్దతుగా మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులు (సీఐటీయూ అనుబంధ సంఘం) మంగళవారం కమిషనర్ అశోక్‌రెడ్డికి సమ్మె నోటీస్ అందజేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను తుంగలో తొక్కిందని ఆరోపించారు. నాలుగు లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు అందించాలన్నారు. మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేసి కాంట్రాక్ట్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని కోరారు. సీఐటీయూ మండల కన్వీనర్ నీలా రామ్మూర్తి, మున్సిపల్ కార్మిక సంఘం అధ్యక్షుడు ఎస్‌కె జానీ, రాములు, మట్టయ్య, రాము, శ్రీహరి, శోభన్ తదితరులు ఉన్నారు.



మఠంపల్లిలో సమ్మె పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు, కార్మికులు



నేరేడుచర్ల : మున్సిపల్ కమిషనర్‌కు సమ్మె నోటీస్ అందజేస్తున్న కార్మికులు